# సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

- అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరికలు
- అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్


బీఆర్ఎస్‌లో చేరుతున్న వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

వట్‌పల్లి, అక్టోబర్ 18: తెలంగాణ ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలే శ్రీరామ రక్షగా నిలుస్తున్నాయని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. మండలంలోని పోతులబోగుడ గ్రామంలోని ఎమ్మెల్యే నివాసంలో బుధవారం మునిపల్లి మండలంలోని బుసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, చౌటకూర్ మండల కేంద్రం కాంగ్రెస్, బీఎస్పీ పార్టీల నాయకులు, పుల్కల్ మండలంలోని బస్వాపూర్ కాంగ్రెస్ మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు మొత్తం 150 మందికి పైగా ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఫారుక్, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతి, డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. అందుకే ప్రతి ఎన్నికలో సీఎం కేసీఆర్‌కు మద్దతుగా ప్రజలు నిలుస్తున్నారన్నారు. నియోజవర్గంలో మున్ముందు బీఆర్ఎస్‌లో భారీఎత్తున చేరికలు ఉంటాయన్నారు. నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరడం కాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సీతారామాలయంలో ఎమ్మెల్యే పూజలు


బోర్పట్లలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

హత్నూర, అక్టోబర్ 18: హత్నూర మండలం బోర్పట్ల గ్రామంలోని సీతారామాలయంలో బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేయడంతోపాటు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ కృషితో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసినట్లు గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితో ప్రజలు పార్టీకి అండగా నిలుస్తూ ఆశీర్వదిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, జడ్పీటీసీ ఆంజనేయులు, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రమేశ్‌నాయక్, దుర్గారెడ్డి, బుచ్చిరెడ్డి, నవీన్‌గౌడ్, కిశోర్, సత్యనారాయణ, సుధాకర్, అర్జున్, నరేందర్, సాయి, అజీస్, కిషన్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేగా 'గూడెం' గెలవాలని తలనీలాలు


తలనీలాలు సమర్పించిన బీఆర్ఎస్ జిన్నారం మండల సోషల్ మీడియా అధ్యక్షుడు

జిన్నారం, అక్టోబర్ 18: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మూడోసారి గెలుపొందాలని కోరుతూ బీఆర్ఎస్ జిన్నారం మండల సోషల్ మీడియా అధ్యక్షుడు నాయికోటి భీమ్‌రావు తలనీలాలు సమర్పించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ముచ్చటగా మూడోసారి గెలుపొందాలని బుధవారం యాదాద్రి క్షేత్రంలో మొక్కుకున్నారు. తలనీలాలు సమర్పించి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే మూడోసారి గెలిస్తే మళ్లీ స్వామివారిని దర్శించుకొని మరోసారి తలనీలాలు సమర్పిస్తానని తెలిపారు.

## వాహన తనిఖీల్లో రూ.11.4లక్షలు స్వాధీనం


పడియాల్ తండావద్ద డబ్బులు స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ

జహీరాబాద్, అక్టోబర్ 18: అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఎలాంటి పత్రాలు లేకుండా నగదు తరలిస్తున్న డబ్బులను సీజ్ చేశామని చెరాగ్‌పల్లి ఎస్ఐ నరేశ్ తెలిపారు. బుధవారం మొగుడంపల్లి మండలంలోని పడియాల్ తండా సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా హైదరాబాద్‌లోని మజీద్‌బండకు చెందిన పార్థసారథి కారులో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.7.5 లక్షల నగదును పట్టుకున్నట్లు తెలిపారు. సరైన పత్రాలు లేకపోవడంతో డబ్బులను సీజ్ చేసి జిల్లా అధికారులకు అప్పగించామన్నారు. అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక వైపు నుంచి మహారాష్ట్రాలోని ఔరంగాబాద్‌కు వెళ్తున్న కన్నను గ్రాండ్ కారులో నుంచి రూ.3.90 లక్షలు స్వాధీనం చేసుకొని జిల్లా అధికారులకు అప్పగించామన్నారు.

## ఐదుగురు కార్మికుల డిశ్చార్జి

జిన్నారం, అక్టోబర్ 18: బొల్లారం పారిశ్రామిక వాడలోని అమర ల్యాబ్స్ పరిశ్రమలో ఈనెల 13న శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో గాయపడి మమత దవాఖానలో చికిత్స పొందుతున్న ఐదుగురు కార్మికులు డిశ్చార్జి అయినట్లు బొల్లారం పోలీసులు తెలిపారు. డిశ్చార్జి అయిన వారిలో సంతోశ్‌కుమార్, వినోద్‌కుమార్, స్వామి, ధనుకుమార్, సూర్యారావు ఉన్నారు. రాకేశ్‌కుమార్, రాజకుమార్, అజయ్‌కుమార్ అనే ముగ్గురు కార్మికులను మెరుగైన చికిత్స కోసం మూసాపేటలోని ఓమెరా దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు.

## క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి


మాట్లాడుతున్న డీఐఈఓ గోవిందరామ్

న్యాల్‌కల్, అక్టోబర్ 18: క్రమశిక్షణతో విద్యార్థులందరూ విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఇంటర్ బోర్డు జిల్లా విద్యాధికారి గోవిందరామ్ ఆకాంక్షించారు. మండల కేంద్రమైన న్యాల్‌కల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో పిల్లలు ఉన్నత చదువులు చదువుకోవాలని కళాశాలకు పంపిస్తున్నారన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి అధ్యాపకులు చెప్పే పాఠాలను చక్కగా విని నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. స్థానిక కళాశాలలో పనిచేస్తూ పదోన్నతిపై ఆలేరు డిగ్రీ కళాశాలకు వెళ్తున్న బాలస్వామికి అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన బతుకమ్మ ఆటపాటలు, సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అంతకుముందు మండలంలోని హద్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈఓ గోవింద్‌రామ్ సందర్శించారు. కళాశాలలో బోధన తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్, అశోక్, ఎస్‌బీఐ మేనేజర్ విశ్వేశ్వరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కల్యాణం.. కమనీయం


కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సతీమణి యాదమ్మ

గుమ్మడిదల, అక్టోబర్ 18: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బుధవారం మండల కేంద్రమైన గుమ్మడిదలలో ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి భూదేవి సమేత కల్యాణవేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పచ్చని పందిళ్లు వేసి కల్యాణవేదికలో శ్రీదేవి భూదేవి సమేత కల్యాణవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు వేదపండితులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సతీమణి గూడెం యాదమ్మ విశిష్ట హాజరయ్యారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, జడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఎంపీపీ సద్ది ప్రవీణావిజయభాస్కర్‌రెడ్డి, జిన్నారం ఎంపీపీ రవీందర్‌గౌడ్ తదితర నాయకులు శ్రీవారి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఆలయకమిటీ అధ్యక్షుడు పడమటి లక్ష్మారెడ్డి, సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి కల్యాణాన్ని తిలకించారు. ఆలయ వంశపారంపర్యకులు కేవీ సుందరాచార్యులు, కేవీ నర్సింహాచార్యులు, కేవీ రంగనాథచార్యుల ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించారు. ఈ వేడుకలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంధ్యాల విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపసర్పంచ్ మొగులయ్య, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మడపతి గణేశ్, భక్తులు పాల్గొన్నారు.

## చర్చి నిర్మాణానికి భూమిపూజ


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, అక్టోబర్ 18: నారాయణఖేడ్‌లో నూతనంగా నిర్మించనున్న మెథడిస్ట్ చర్చికి సంబంధించి బుధవారం భూమిపూజ నిర్వహించగా ఫాస్టర్ల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ మిషనరీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శిల్వ వద్ద ఎమ్మెల్యే పాస్టర్లతో కలిసి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో మహారెడ్డి భూపాల్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నియోజకవర్గం ఊహించని రీతిలో అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలోనూ, నారాయణఖేడ్‌లోనూ మరోసారి బీఆర్ఎస్ విజయం సాధించాలని పాస్టర్లు దీవించారు.

## పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఆర్డీవో

అందోల్, అక్టోబర్ 18: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆర్డీవో పాండు పరిశీలించారు. జోగిపేటలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ బూత్‌ను పరిశీలించి మూత్రశాలలు, తాగునీరు, ర్యాంప్‌లు, విద్యుత్ సరఫరాలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ ఆంటోని, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.


జోగిపేటలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో పాండు

## దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లాలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండలపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం శ్రీమహాలక్ష్మిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.
- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, అక్టోబర్ 18


జిన్నారం(బొల్లారం): కేబీఆర్ కాలనీలో అమ్మవారు


గుమ్మడిదల: బొంతపల్లిలో..